నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 VIKARABAD





# అన్నదాతకు అండగా..

## నేడు ఆమనగల్లులో రైతు నిరసన దీక్ష..

- పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తుక్కుగూడ నుంచి భారీ ర్యాలీ
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ఘనస్వాగతం పలికేందుకు విస్తృత ఏర్పాట్లు
- షాబాద్ సభ సక్సెస్‌తో అదే జోరు కొనసాగిస్తున్న పార్టీ శ్రేణులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు నిరసనగా.. అన్నదాతకు అండగా ఉండేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు ఆమనగల్లులో రైతు నిరసన దీక్ష నిర్వహిస్తున్నారు. దీనికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ దీక్షకు కోర్టు షరతులతో కూడిన అనుమతులివ్వగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల నుంచి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చే అవకాశమున్నది. కేటీఆర్ హైదరాబాద్ నుంచి బయలుదేరి 11 గంటలకు తుక్కుగూడకు చేరుకుంటారు. అక్కడ మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి.. వేలాది కార్లతో ఆమనగల్లు వరకు ర్యాలీగా రానున్నారు. 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12 గంటలకు రైతు నిరసన దీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. వాహనాల పార్కింగ్, తాగునీరు, ఇతరత్రా అన్ని సౌకర్యాలను కల్పించారు. దీక్ష విజయవంతానికి మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, నాయకులు పట్నం అవినాశ్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు కృషి చేస్తున్నారు.



దీక్షాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సిద్ధమైన దీక్షాస్థలి

### జిల్లాలో రెండో రైతు దీక్ష..

జిల్లాలో ఇప్పటికే షాబాద్‌లో రైతు దీక్ష నిర్వహించగా అది సక్సెస్ అయ్యింది. అలాగే మంగళవారం రెండో రైతుదీక్షను ఆమనగల్లులో నిర్వహిస్తున్నారు. దీనిని కూడా విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు గతవారం రోజులుగా కృషిచేస్తున్నారు.

### అడుగడుగునా ఘనస్వాగతం పలికేలా..

మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ ర్యాలీకి అడుగడుగునా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. తుక్కుగూడ నుంచి బయలుదేరిన కేటీఆర్ కందుకూరులో పార్టీ జెండా ఆవిష్కరించనున్నారు. అలాగే, కడ్తాల్‌లోనూ పార్టీ జెండాను ఎగురవేసి ఆమనగల్లుకు చేరుకుంటారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి చేరుకోగానే అక్కడి నుంచి భారీ ర్యాలీతో సభాస్థలికి చేరుకోనున్నారు.



### అధినేతకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి..

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. -వికారాబాద్, ఫిబ్రవరి 17

### పందెం కోళ్లకు వేలంపాట



మొయినాబాద్ మండలం, తోలుకట్టా గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంపై ఈ నెల 11న ఎస్‌వోటీ, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి 84 పందెం కోళ్లను స్వాధీనం చేసుకోగా.. వాటిని సోమవారం రాజేంద్రనగర్ 13వ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అనుమతితో వేలం పాట వేశారు. ప్రభుత్వానికి రూ.16,60,000 ఆదాయం సమకూరింది.

వివరాలు 4 పేజీలో..

## రూ.10 లక్షల విలువైన
# నకిలీ విత్తనాలు స్వాధీనం

- పట్టుకున్న జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 17 : సుమారు పది లక్షల విలువైన నకిలీ విత్తనాలను జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దేముల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, టాస్క్‌ఫోర్స్ బృందం, పెద్దేముల్ పోలీసులు, పెద్దేముల్ వ్యవసాయాధికారి కలిసి.. ఈ నెల 16న పెద్దేముల్ అంబేద్కర్ విగ్రహం వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా.. అతడి వద్ద నాలుగు ప్లాస్టిక్ సంచుల్లో ఎలాంటి లేబుల్స్, లాట్‌నంబర్, బ్యాచ్‌నంబర్ లేని.. తుది గడువు లేని పత్తి విత్తనాల ప్యాకెట్లు కనిపించాయి. వాటిని వ్యవసాయాధికారి పరిశీలించి నకిలీవిగా నిర్ధారించారు. దీంతో పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఏపీలోని బాపట్ల జిల్లా కోనంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి వసంత్‌రావుగా గుర్తించారు. అతను గత 15 ఏండ్లు గా కర్ణాటకలోని గాజుర్‌కోట్ గ్రామం లో జీవిస్తున్నాడని..అతడు అక్కడి నుంచి నకిలీ విత్తనాలను రైతులకు విక్రయించేందుకు పెద్దేముల్‌కు వచ్చాడని తెలిపారు. సీజన్‌లో వాటిని అమ్మాలంటే అధికారులు, పోలీసుల నిఘా అధికంగా ఉండడంతో.. ఇప్పుడు అమ్మితే ఎవరికీ అనుమానం రాదని భావించి.. రైతులకు అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారు. నాలుగు సంచుల్లో సుమారు రూ. 2.70 లక్షల విలువ కలిగిన 150 కేజీల నకిలీ పత్తి విత్తనాలను పంచనామా నిర్వహించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ అధికారులు, పెద్దేముల్ పోలీసులు నిందితుడు నివసిస్తున్న కర్ణాటకకు వెళ్లి అక్కడ సుమా రు రూ. 7.20 లక్షల విలువ కలిగిన 4 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకుని..నిందితుడిపై పెద్దేముల్ ఠాణాలో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అతడిపై బషీరాబాద్ ఠాణాలోనూ గతంలో నకిలీ పత్తి విత్తనాల కేసు నమోదైందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో కరణ్‌కోట్ ఇన్‌స్పెక్టర్ నగేశ్, పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ , సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం : అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



వికారాబాద్ : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మొక్క నాటుతున్న బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

# మొక్కలు నాటి.. అభిమానం చాటి..

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు
- ఉదయం నుంచే పల్లె, పట్టణాల్లో పండుగ సందడి
- ప్రధాన కూడళ్లలో కేట్ కటింగ్‌లు.. శ్రేణులకు పంపిణీ
- తెలంగాణ జాతిపిత నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పూజలు
- ఆస్పత్రుల్లో మొక్కలు నాటడంతోపాటు రోగులకు పండ్ల పంపిణీ



కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని మీర్‌పేట పెద్ద చెరువు కట్టపై మొక్క నాటుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి




ధారూరులో కేసీఆర్ చిత్రపటంతో తయారు చేసిన కేక్

తెలంగాణ ఆత్మగౌరవాన్ని సమున్నత శిఖరాలకు చేర్చిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా బీఆర్ఎస్ శ్రేణులు ప్రధాన కూడళ్లలో కేకులు కట్ చేసి పటాకులు కాల్చి.. ఒకరికొకరు తినిపించుకున్నారు. తెలంగాణ జాతిపిత నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్పత్రుల వద్ద రోగులకు పండ్ల పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. మహేశ్వరం నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధినేత పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. కడ్తాల్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ కేక్‌కట్ చేశారు. అదేవిధంగా షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పాల్గొని కేక్ కట్ చేసి చేశారు. షాబాద్ మండలంలోని ముద్దంగూడలో ఆ పార్టీ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి పొలాల్లో రైతులతో కలిసి కేక్ కట్ చేశారు. అదేవిధంగా వికారాబాద్ మున్సిపాలిటీ పరిధి, ధన్నారం సమీపంలోని యజ్ఞ ఫౌండేషన్‌లో చిన్నారులతో కలిసి కేసీఆర్ జన్మదినాన్ని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. అంతకుముందు వారు వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి మొక్క నాటారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పార్టీ అధినేత పుట్టిన రోజును పురస్కరించుకుని పరిగిలో మొక్క నాటారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కొడంగల్‌లో కేక్ కట్ చేయడంతోపాటు స్థానిక ఆస్పత్రిలో మొక్కను నాటి.. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కేసీఆర్ మనసున్న మారాజు అని.. రాష్ట్రాన్ని సాధించిన కారణజన్ముడు అని కొనియాడారు. అన్నివర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని.. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అట్టడుగు వర్గాలకూ మేలు చేశారన్నారు. కేసీఆర్ నిండు నూరేండ్లు జీవించాలన్నారు. రాష్ట్రాన్ని సాధించడంతోపాటు పదేండ్లలో తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే మొదటిస్థానంలో నిలిపారన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ